క్లుప్తంగా

వారాంతపు సంత రద్దు

నందిపేట్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలో సోమవారం నిర్వహించే వారాంతపు సంత రద్దయినట్లు తహసీల్దార్ ఆనంద్ కుమార్ ఆదివారం తెలిపారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నందిపేటలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున సంతను రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

లక్ష్మీనృసింహ స్వామి ఉత్సవాలు ప్రారంభం



భీమ్‌గల్: శ్రీలక్ష్మీ నృసింహ స్వామి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామ దేవత, పెదగంటి ఎల్లమ్మ తల్లికి, లక్ష్మీనృసింహ స్వామికి శేష వస్త్రాలు, సారె సమర్పించారు. మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, మంగళ హారతులు, గోవింద నామస్మరణతో భక్తులు వెంట రాగ పెదగంటి ఎల్లమ్మ ఆలయానికి ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సారె, శేష వస్త్రాలు సమర్పించారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు రూ.50 వేల విరాళం



సిరికొండ: న్యావనంది గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామంలోని తూముకాడి మున్నూరు కాపు సంఘం సభ్యులు రూ.50 వేలను విరాళంగా అందజేశారు. ఆదివారం సమావేశమైన సంఘం సభ్యులు పాఠశాల అభివృద్ధికి విరాళం ఇవ్వాలని నిర్ణయించారు. పాఠశాలలో చేపట్టే అభివృద్ధి పనులకు తమ సంఘం తరపున సహకారం అందించాలని గ్రామాభివృద్ధి కమిటీకి విరాళం అందిస్తున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



డిచ్‌పల్లి: ధర్మారం(బి)లో శ్రీదేవీ భూదేవీ సహిత వెంకటేశ్వరస్వామి దేవాలయ సముదాయం సత్యనారాయణ స్వామి, విజయ గణపతి– నవగ్రహములు, ఉమామహేశ్వర స్వామి, అభయ ఆంజనేయ స్వామి, శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, సంతాన నాగేంద్ర స్వామి దేవాలయాల ద్వాదశ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం శివపార్వతుల కల్యాణం కనుల పండువగా జరిగింది. ఉత్సవాల్లో భాగంగా బ్రహ్మశ్రీ వేలేటి పశుపతి శర్మ, బ్రహ్మశ్రీ ఉమామహేశ్వర శర్మ ఆధ్వర్యంలో వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రావుల బ్రహ్మానందం, ప్రధానార్చకులు రాహుల్ త్రిపాఠి తెలిపారు.



అనాథల ఆత్మశాంతి కోసం కాశీలో కర్మకాండలు

నిజామాబాద్‌నాగారం: కొంతకాలంగా ఇందూర్ యువత సంస్థ ఆధ్వర్యంలో అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ప్రత్యేకంగా అనాథల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కాశీలో మణికర్ణిక ఘాట్ వద్ద కర్మకాండలను సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు, సాయితేజ, భాస్కర్, సంజీవ్, నీవాస్, భాస్కరచారీ తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్‌కు సర్వం సిద్ధం

- బోధన్‌లో ఎన్నికల సామగ్రి పంపిణీ
- సిబ్బందికి విధులు కేటాయించిన అధికారులు
- పోలింగ్ కేంద్రాలు 246



బోధన్‌లో మాట్లాడుతున్న ఆర్డీవో రాజేశ్వర్



బోధన్‌లో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో అధికారులు

బోధన్: పార్లమెంట్ ఎన్నికలకు జరుగనున్న పోలింగ్ నిర్వహణకు అధికార యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేసింది. సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. ఆదివారం బోధన్ పట్టణ కేంద్రంలోని విజయమేరి హైస్కూల్‌లో నియోజక వర్గానికి సంబంధించిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పార్లమెంట్ ఎన్నికల నియోజక వర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్ పర్యవేక్షణలో ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలోని బోధన్ పట్టణం, మండలం, సాలూర, ఎడపల్లి, రెంజల్, నవీపేట మండలాల్లో 246 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఈ పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 2,23,096 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 1,06,372 మంది, 1,16,719 మహిళ ఓటర్లు, ఇతరులు 5 మంది ఉన్నారు. పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆర్డీవో తెలిపారు. పోలింగ్ అధికారులు, ఓటర్లు ఎన్నికల నిబంధనలు, మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. ఎన్నికల సంఘం సూచించిన 13 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి తీసుకెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ సజావుగా సాగేలా ప్రజలు, రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.

ఆర్మూర్‌లో 217 పోలింగ్ కేంద్రాలు



ఆర్మూర్‌లో ఎన్నికల విధులకు హాజరైన సిబ్బంది

ఆర్మూర్, ఆర్మూర్ టౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఆర్మూర్ నియోజకవర్గ పరిధిలో సోమవారం నిర్వహించే పోలింగ్ ప్రక్రియకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి ఎన్నికల సిబ్బందికి సామగ్రిని పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలోని ఆర్మూర్ మున్సిపాలిటీ, ఆర్మూర్ మండలం, నందిపేట, మాక్లూర్, ఆలూర్, డొంకేశ్వర్ మండలాల్లో 217 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,12,145 ఓటర్లు ఉండగా పురుషులు 98,737, మహిళలు 1,13,401, ఇతరులు 7గురు ఉన్నారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించడానికి పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బలగాలను మోహరించామని ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి తెలిపారు. నియోజకవర్గం పరిధిలో 55 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు గుర్తించగా వాటి వద్ద వెబ్ కెమెరాలను, ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద వీడియో షూటింగ్‌కు ఏర్పాట్లు చేశారు.





బోధన్‌లో ఎన్నికల సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్తున్న అధికారులు, సిబ్బంది



ఆర్మూర్‌లో సిబ్బందికి విధులు కేటాయిస్తున్న అధికారులు





ఆర్మూర్‌లో ఎన్నికల సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్తున్న అధికారులు, సిబ్బంది



సిబ్బంది తరలించడానికి ఏర్పాటు చేసిన బస్సులు

ముూడు పార్టీలకు ప్రతిష్టాత్మకం

- ఎన్నికల్లో అంతుచిక్కని బాల్కొండ ఓటరు నాడి
- ఓట్ల కోసం ప్రధాన పార్టీల నేతల ఆరాటం

మోర్తాడ్: నిజామాబాద్ పార్లమెంట్ స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో సోమవారం బాల్కొండ అసెంబ్లీ సెగ్మెంట్ ఓటర్లు ఇచ్చే తీర్పు ఎలా ఉండబోతుందో సర్వత్రా చర్చ జరుగుతోంది. ఒక్కో ఎన్నికలో ఒక రకమైన తీర్పును ఇస్తున్న బాల్కొండ ఓటరు నాడి ఏ పార్టీ నాయకులకు చిక్కకుండా ఉంది. 2023లో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రం అంతటా కాంగ్రెస్ గాలి వీస్తే బాల్కొండ నియోజకవర్గంలో మాత్రం భిన్నమైన తీర్పును ఇచ్చిన ఓటర్లు బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన ప్రశాంత్‌రెడ్డిని గెలిపించారు. ఈ ఎన్నికల్లో వచ్చిన తీర్పును బాల్కొండ ఓటర్లు పార్లమెంట్ ఎన్నికల్లో తిరగరాస్తారా లేదా అసెంబ్లీ ఎన్నికల తీర్పును పునరావృతం చేస్తారా అనే అంశంపై స్పష్టత కరువైంది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో తొలిసారి సిట్టింగ్ ఎంపీ కవితపై గెలిచిన అర్వింద్‌కు 67,170 ఓట్లు దక్కాయి. ఈసారి కూడా అర్వింద్‌కు అంతకుమించి ఓట్లు వచ్చేలా అన్నపూర్ణమ్మ ఆమె మద్దతుదారులు ప్రయత్నిస్తున్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు తగ్గకూడదని ప్రశాంత్‌రెడ్డి, బలం పెంచుకోవాలని సునీల్ రెడ్డి, పాత రికార్డును కాపాడుకోవాలని అన్నపూర్ణమ్మలు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. ఓటర్లు ఎలాంటి తీర్పు ఇస్తారో వేచి చూడాల్సి ఉంది.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న అధికారులు



సాలూర పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

బోధన్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం నిర్వహించే పోలింగ్ ప్రకియకు పోలింగ్ కేంద్రాల అధికారులు, సిబ్బంది ఆదివారం ఎన్నికల సామగ్రిని వెంట తీసుకుని కేంద్రాలకు చేరుకున్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రం లోపల ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రం బయట గోడలకు పోటీ చేస్తున్న ఎంపీ అభ్యర్థుల పేర్లు, వారి గుర్తులతో ఉన్న ఫ్లెక్సీని పెట్టారు. సాలూర మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో 107 నుంచి 112 వరకు ఆరు పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. స్థానిక జీపీ కార్యదర్శి ప్రవీణ్, సిబ్బంది పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

ముస్తాబైన పోలింగ్ కేంద్రాలు



మోర్తాడ్‌లో పోలింగ్ స్టేషన్‌ను శుభ్రం చేస్తున్న సిబ్బంది



ముప్కాల్ మండలం రెంజర్లలో పోలింగ్ కేంద్రం వద్ద నీటితో శుభ్రం చేస్తున్న సిబ్బంది

మోర్తాడ్/ డొంకేశ్వర్/ వేల్పూర్/ ఎడపల్లి/ బాల్కొండ: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు అన్ని కేంద్రాలను జిల్లా అధికారులు సిద్ధం చేశారు. సోమవారం పోలింగ్ నిర్వహించనుండగా ఆదివారం రోజున గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను పంచాయతీ సిబ్బంది శుభ్రం చేశారు. మున్సిపాలిటీల్లోని పోలింగ్ బూత్‌ల బాధ్యతలను మున్సిపల్ సిబ్బందికి అప్పగించారు. నిజామాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలో 1,808 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఉక్కపోత ఇబ్బందులు లేకుండా ఉండేందుకు కూలర్లను ఏర్పాటు చేయించారు. ఓటర్లు ఎక్కువ సంఖ్యలో క్యూ కడితే వారికి ఎండ నుంచి రక్షణ కల్పించడానికి టెంట్లను సైతం ఏర్పాటు చేయిస్తున్నారు. నీటి సౌకర్యం, ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచడానికి చర్యలు తీసుకున్నారు. పోలింగ్ స్టేషన్‌లను పంచాయతీ, మున్సిపాలిటీ సిబ్బంది ఉదయమే శుభ్రం చేశారు.

పార్లమెంట్ ఎన్నికలకు డొంకేశ్వర్ మండలంలోని పోలింగ్ కేంద్రాలు సిద్ధమయ్యాయి. సోమవారం నిర్వహించే ఎన్నికలకు మండల కేంద్రంలోని జీపీ బిల్డింగ్‌లో 128 బూత్‌ను మహిళా పోలింగ్ కేంద్రంగా తోరణాలు, ఫ్లెక్సీలు పెట్టి ముస్తాబు చేశారు. ఈ బూత్‌లో పని చేసే పోలింగ్ సిబ్బంది పూర్తిగా మహిళలే ఉంటారు. అలాగే జెడ్పీ పాఠశాలలో 127 బూత్‌ని మోడల్ పోలింగ్ కేంద్రంగా అలంకరించారు. మండలంలో మొత్తం 19 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఆదివారం సాయంత్రానికి పోలింగ్ సిబ్బంది ఈవీఎం మిషిన్లతో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. వేల్పూర్ మండలంలో 18 జీపీలు ఉండగా 39 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మండలంలో మొత్తం 36,845 మంది ఓటర్లు ఉండగా పురుషులు 16,843, స్త్రీలు 20,002 మంది ఓటర్లు ఉన్నారు. ఎడపల్లిలో మండలంలో ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ ధన్వాల్ తెలిపారు. మండలంలో 31, 400 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. 36 పోలింగ్ కేంద్రాలు ఉండగా తొమ్మిది సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంతాల్లో స్థానిక పోలీసులతో పాటు కేంద్రబలగాలు వచ్చినట్లు ఎస్సై వంశీచందర్‌రెడ్డి చెప్పారు.

ఎన్నికల నిర్వహణకు బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను ముమ్మరం చేశారు.

ఎంపీ స్థానంలో మానాల ప్రత్యేకం..



మానాల గ్రామ ముఖ చిత్రం

- పునర్విభజనలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో విలీనం
- అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల్లో బాల్కొండ, నిజామాబాద్ అభ్యర్థులకే ఓట్లు
- మూడు జిల్లాలకు విస్తరించిన పార్లమెంట్ స్థానం

మోర్తాడ్: నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మానాల గ్రామానికి ప్రత్యేక స్థానం ఉంది. జిల్లాలు, మండలాల పునర్విభజనలో భాగంగా మానాల గ్రామం రుద్రంగి మండలంలో కలిసి, రాజన్న సిరిసిల్లా జిల్లాలో విలీనమైంది. అంతకు ముందు కమ్మర్‌పల్లి మండలంలో ఈ గ్రామం కొనసాగింది. మానాల పరిధిలో 14 తండాలు ఉండగా వాటిలో పదింటిని పంచాయతీలుగా మార్చారు. మానాలలో మొత్తం 4771 మంది ఓటర్లు ఉండగా పురుషులు 2305, మహిళలు 2466 మంది ఉన్నారు. మండలం, జిల్లా మారినా నియోజకవర్గాల విభజన జరగకపోవడంతో మానాల, అనుబంధ పంచాయతీల పరిధిలోని ఓటర్లు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం తమ ఓట్లను బాల్కొండ, నిజామాబాద్ స్థానాల్లో నిలిచిన అభ్యర్థులకు వేయాల్సి వస్తోంది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి సైతం ఇక్కడి ఎంపీటీసీ సభ్యులు నిజామాబాద్ స్థానానికి తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంది.

విభజన జరగకపోవడంతో..

వాస్తవానికి నిజామాబాద్ ఎంపీ స్థానం పరిధిలో ఈ జిల్లాతో పాటు జగిత్యాల్ జిల్లా ఉంది. మానాల కూడా కొనసాగుతుండటంతో నిజామాబాద్ ఎంపీ స్థానం మూడు జిల్లాలకు విస్తరించిందని వెల్లడవుతోంది. నియోజకవర్గాల పునర్విభజన జరిగే వరకు మానాల గ్రామస్తులకు నిజామాబాద్ జిల్లాతో అనుబంధం ఇంకా ముడిపడి ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ వైస్ ఎంపీపీ



జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మాజీ వైస్ ఎంపీపీ జితేందర్ నాయక్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సమక్షంలో జితేందర్ నాయక్ ఆయన భార్య జమున కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే, కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు మద్దుల రమేష్, గడ్డం గంగారెడ్డి, నర్సారెడ్డి, సొప్పరి వినోద్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు



సిరికొండ: పెద్దవాల్గోట్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు తలకట్ల పెద్ద గంగారెడ్డి, సాగర్‌రెడ్డిలు జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి సమక్షంలో బీజేపీలో ఆదివారం చేరారు. జిల్లా అధ్యక్షుడు వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ మండలాధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, ఐటీ సెల్ కన్వీనర్ గోవింద్, గంగారెడ్డి పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – ఆ ఒక్కటీ అడక్కు (తెలుగు) – 01.20, ఆరంభం (తెలుగు) – 4.15, ప్రసన్న వదనం (తెలుగు) – 7.10, బ్రహ్మచారి (తెలుగు) 10.15

స్క్రీన్-2 – కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్ – 11.45, 2.55, 6.05, 9.15

స్క్రీన్-3 – ప్రతినిధి-2 (తెలుగు) – 12.15, 6.20, 9.15, బాక్ (తెలుగు) – 3.10

స్క్రీన్-4 – కృష్ణమ్మ (తెలుగు)– 12.45, 3.40, 6.35, 9.30

ఓటు వేసేదెలా..?

- జీపీ కార్యదర్శులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం ఇవ్వని ఈసీ
- ఉదయం నుంచే పోలింగ్ విధుల్లో పాల్గొననున్న కార్యదర్శులు



బోధన్ : పార్లమెంట్ ఎన్నికల్లో పంచాయతీ కార్యదర్శులు తమ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం లేకుండా పోయింది. వారికి ఎన్నికల కమిషన్ పోస్టల్ బ్యాలెట్ అవకాశం ఇవ్వలేదు. ఉదయం నుంచి రాత్రి వరకు పోలింగ్ విధుల్లో ఉండే కార్యదర్శులు తమ గ్రామాల్లో ఓటు వేసే అవకాశం లేదు. ఈ విషయంలో జిల్లా అధికార యంత్రాంగం పట్టించుకోలేదనే విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో 530 మంది పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో ఇతర జిల్లాల వారు సైతం ఉన్నారు. ఒక అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన వారు మరో నియోజకవర్గంలో విధులు నిర్వహిస్తున్నారు. కార్యదర్శులకు ఎన్నికల సంఘం ఎలక్షన్ డ్యూటీ ఆర్డర్ ఇవ్వలేదు. దాంతో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వినియోగించేకునే అవకాశం లేకుండా పోయింది. కార్యదర్శులను బీఎల్‌వో క్యాడర్‌గా గుర్తించి పోలింగ్ కేంద్రాల నిర్వహణకు సంబంధించిన విధులను జిల్లా యంత్రాంగం అప్పగించింది. మరో ప్రత్యామ్నాయ మార్గంగా ఆయా మండల స్థాయి అధికారులు ఈడీసీ (ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికేట్) జారీ చేసి ఉంటే, విధులు నిర్వర్తించే గ్రామంలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటు అవకాశం ఉండేది. ఈ సర్టిఫికేట్ కూడా అధికారులు జారీ చేయలేదు. ఈ పరిస్థితిల్లో పోలింగ్ కేంద్రాల సౌకర్యాలు, సిబ్బంది భోజన వసతులు ఏర్పాట్లు విధుల్లో ఉన్న పంచాయతీ కార్యదర్శులు ఓటు వినియోగించుకునే అవకాశం కోల్పోనున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికల సంఘం పంచాయతీ కార్యదర్శులకు ఎలక్షన్ డ్యూటీ ఆర్డర్స్ ఇచ్చి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే అవకాశం కల్పించింది. కానీ ప్రస్తుతం ఆ అవకాశం ఇవ్వలేదు. ఈ విషయంలో డీపీవో తరుణ్ జోషిని వివరణ కోరగా పంచాయతీ కార్యదర్శులకు ఎన్నికల సంఘం ఎలక్షన్ డ్యూటీ ఆర్డర్స్ ఇవ్వనందునా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం లేదన్నారు.